'హాస్టల్ నిద్ర'కు సన్నాహాలు

- గురుకులాలు, వసతి గృహాల్లో వసతులు కొరవడుతున్న నేపథ్యంలో మేల్కొన్న సర్కారు
- అధికారులతో విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు చర్యలు

కలెక్టరేట్, ఆగస్టు 25 : సంక్షేమ హాస్టళ్లలో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వసతిగృహాల్లో కొరవడిన వసతులు, సౌకర్యాల లేమిని ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు జిల్లాలో హాస్టల్ నిద్ర కార్యక్రమం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారానికో హాస్టల్‌లో అధికారులు రాత్రిపూట నిద్రించి, ఆ హాస్టల్‌లో విద్యార్థులకందుతున్న సేవలపై వారి నుంచే ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా సంక్షేమ వసతి గృహాల్లో నెలకొంటున్న వరుస పరిణామాల నేపథ్యంలో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో నెలకోసారైనా కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులు నిద్ర చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో అధికారులు హాస్టల్ నిద్ర కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వసతిగృహాల్లో నిద్ర చేసే కార్యక్రమం నిరాటంకంగా కొనసాగింది. గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్, విషజ్వరాలు, సౌకర్యాల కొరతపై తెలుసుకుని వెంటనే చర్యలు చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం నిలిచిపోయింది. దీంతో, వాటిలో జరుగుతున్న పరిణామాలు తెలుసుకోవడం కష్టసాధ్యమవుతుండగా, విద్యార్థులు అనారోగ్యం పాలైనప్పటికీ దవాఖానలకు కూడా చేర్చలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పుకొని, వారు వచ్చి హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించే వరకు హాస్టళ్లలోనే ఉంటున్నారు. తల్లిదండ్రులు రావడం ఆలస్యమైతే వారి పరిస్థితి విషమించి, మరణాలు కూడా సంభవిస్తుండడంతో, మేలుకొన్న ప్రభుత్వం హాస్టళ్లలో నిద్ర చేసి, సమస్యలు తెలుసుకోవాలంటూ ఆదేశించగా హాస్టల్ నిద్ర పునఃప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో 80 దాకా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, వసతి గృహాలతో పాటు గురుకులాల్లో ఉన్నతాధికారులు నిద్ర చేయనుండగా, ముందుగా బాలికల హాస్టళ్ల నుంచి మొదలు పెట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు 'బండి' క్షమాపణ చెప్పాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

- కేంద్ర మంత్రిగా కల్వల ప్రాజెక్టు మరమ్మతులకు ఒక్క రూపాయి నిధులైనా తెచ్చారా?
- రుణమాఫీపై ఎందుకు స్పందించడం లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, ఆగస్టు 25: కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని కల్వల ప్రాజెక్టు మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాకపోగా, ప్రజలు, రైతులను మభ్యపెట్టడానికి బీజేపీ నాయకులను దొంగదీక్షకు ఉసిగొల్పినందుకు తక్షణమే రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని గడిమహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు ప్రాజెక్టు మరమ్మతుల కోసం కాకుండా రైతులను క్షమాపణ కోరుతూ దీక్ష చేపట్టాలని హితవు పలికారు. గతంలో భారీ వర్షాలకు కల్వల ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకు పోగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రాజెక్టు మరమ్మతు పనులు చేపట్టాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 70 కోట్లు మంజూరు చేసిందని, తక్షణమే రూ. 15 లక్షలు విడుదలచేసి ప్రాజెక్టు రీడిజైన్, సర్వే చేయించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా ప్రాజెక్టు మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రధాని మోదీ శిష్యుడిగా, అమిత్‌షా చెప్పులు మోసే వ్యక్తిగా చెప్పుకొనే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కల్వల ప్రాజెక్టు మరమ్మతు పనులకు నిధులు తీసుకువచ్చే అవకాశం ఉన్నా కూడా చొరవ తీసుకోకపోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రైతులపై కపట ప్రేమ చూపిస్తున్న రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ ఒక్కటేనని దుయ్యబట్టారు. జిల్లాలో ఇప్పటి వరకు రైతులకు 30 నుంచి 40 శాతం వరకు రుణమాఫీ కాలేదన్నారు. అయినప్పటికీ బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్‌రెడ్డిని నిలదీసే దమ్ము ధైర్యం బండి సంజయ్‌కు లేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్‌కు నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ, కల్వల ప్రాజెక్టు మరమ్మతుల కోసం దీక్షచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ శంకరపట్నం మండలాధ్యక్షుడు గంట మహిపాల్, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, రామంచ గోపాల్‌రెడ్డి, కొత్తకొండ నాగరాజు, పిండి సందీప్, పాషా, ప్రసాద్, కొట్టె రఘు తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆగస్టు 25: వినాయక చవితి పండుగ సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 10 వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

లోక కల్యాణానికే హోమం

శంకరపట్నం, ఆగస్టు 25: లోక కల్యాణం కోసమే శ్రీవేణు గోపాల స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్నట్లు వేద పండితుడు వెంకటేశ్వరాచార్యులు తెలిపారు. ఆదివారం కేశవపట్నం శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో గణపతి, ఆదిత్యాధి, నవగ్రహ, వాస్తు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గీతాపారాయణం, రాత్రి భజనలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గుర్రం రామస్వామి, అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, కోశాధికారి తనుకు ప్రభాకర్, సలహాదారులు, తనుకు ఓంకారం, కర్మకొండ రాజయ్య, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాలడుగుల బాబన్న, జునువాల రాజమల్లు, తనుకు సత్యనారాయణ, కొత్తపల్లి, కోటి, తనుకు శ్రీనివాస్, డిష్ వాసు, కోటి, చంద్రగుప్త, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఐఐటీని సందర్శించిన శ్రీ సరస్వతీ విద్యార్థులు

హైదరాబాద్‌లోని ఐఐటీని సందర్శించిన రామడుగు మండలం వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్ విద్యార్థులు

రామడుగు, ఆగస్టు 25 : వెలిచాలలోని శ్రీ సరస్వతీ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం ఫీల్డ్ ట్రిప్పులో భాగంగా హైదరాబాద్‌లోని ఐఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్షేత్రస్థాయి నుంచి విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకే ఐఐటీ సందర్శన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, వినోదం రెండు కళ్లలాంటివన్నారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు ఫీల్డ్ ట్రిప్ దోహదపడుతుందన్నారు. కాగా, ఐఐటీ ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిగారి మహేశ్ వివిధ విభాగాలకు చూపిస్తూ, వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ఐఐటీ విద్యార్థులతో ముచ్చటించారు. పలు విభాగాల హెచ్‌వోడీలను కలిసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రయోగశాలలో నమూనాలు, టెలిస్కోప్‌ను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రణీత, సునంద, అంజయ్య, జోసెఫ్, మనోహర్, శ్రీనివాస్, ఐఐటీ విద్యార్థులు కిశోర్ కలిత, సత్యబ్రత లెంక తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన సహకార సంఘ భవనం

సహకార సంఘం నూతన భవనం

గంగాధర, ఆగస్టు 25: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం ప్రారంభానికి ముస్తాబైంది. ప్రస్తుతం సహకార సంఘం శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఇరుకైన గదులు, వర్షాకాలంలో తేమతో సిబ్బంది, రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చైర్మన్ దూలం బాలాగౌడ్ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అధికారులతో మాట్లాడి కేంద్ర సహకార బ్యాంకు ద్వారా నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించారు. గతేడాది మే నెలలో భవన నిర్మాణ పనులను ప్రారంభించి అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ నెల 27న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు చేతుల మీదుగా నూతన భవనాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతన సహకార సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ బాలాగౌడ్ కోరారు.

ఇప్పలనర్సింగాపూర్ మొదటిసర్పంచ్ మృతి

గోపాల్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్, ఆగస్టు 25: మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గ్రామ మొదటి సర్పంచ్ మేకల గోపాల్‌రెడ్డి (94) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు రాజిరెడ్డి న్యాక్ డైరెక్టరుగా పని చేస్తున్నారు. గోపాల్‌రెడ్డి 1956లో వరంగల్ ఆర్ఈసీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, రైల్వేశాఖలో కొంతకాలం ఉద్యోగం చేశారు. గ్రామ నామినేటెడ్ సర్పంచ్‌గా పనిచేసే సమయంలో కరెంటు అంటే భయం ఉన్న రోజుల్లో విద్యుత్‌లైన్‌ను గ్రామానికి తీసుకువచ్చి, తన ఇంటికి కరెంటు కనెక్షన్ ఇప్పించుకుని గ్రామస్తులను చైతన్యపరిచారు. గోపాల్‌రెడ్డి మృతికి సిద్దిపేట పశువైద్యశాఖ సహాయసంచాలకుడు కొండల్‌రెడ్డి, ప్రముఖ జర్నలిస్టు దామోదర్, మాజీ సర్పంచులు గూడూరు మోహన్‌రెడ్డి, పల్లె వీరయ్యతో పాటు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మళ్లీ తెరపైకి సోషల్ యాక్షన్ కమిటీలు

- కాంగ్రెస్ అధికారం చేపట్టాక అటకెక్కిన ఎస్ఏటీలు
- ఇటీవల మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలతో పునరుద్ధరణకు చర్యలు
- పాత కమిటీల్లోని సభ్యుల వివరాలు సేకరించడంలో నిమగ్నమైన సెర్ప్ అధికారులు

కలెక్టరేట్, ఆగస్టు 25 : గ్రామాల్లో గత కొన్నాళ్లుగా నిలిచిపోయిన సోషల్ యాక్షన్ కమిటీలు తిరిగి పునరుద్ధరించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మహిళలకు రక్షణ, వారికి తగిన భద్రత కల్పించేందుకు పనిచేసిన ఈ కమిటీలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక వీటికి అవసరమైన నిధులు విడుదల చేయకపోవడంతో అటకెక్కాయి. అయితే, ఇటీవల కొద్దిరోజులుగా మహిళలపై జరుగుతున్న వరుస ఘటనలు, తమకు జరుగుతున్నా అన్యాయం గురించి ప్రశ్నించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో, వీటిని తిరిగి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేయగా, సెర్ప్ అధికారులు ఎస్ఏటీ పాత కమిటీల్లో కొనసాగిన మహిళా సంఘాల సభ్యుల వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. పాతసభ్యులతో పాటు మరికొంత మంది ఔత్సాహిక మహిళలను సభ్యులుగా చేర్చి కొత్తగా కమిటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ కమిటీలు కుటుంబ సభ్యుల మధ్య గొడవల నుంచి మొదలు, ఆయాకుటుంబాల్లోని వృద్ధుల పోషణ, గ్రామాల్లో మహిళలకు జరిగే అన్యాయంపై కూడా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి, వారికి అవసరమైన న్యాయం చేయడంలో కీలకపాత్ర పోషించేవి. అయితే, గత కొద్ది నెలలుగా గ్రామాల్లో వీటి కార్యకలాపాలు నిలిచిపోవడంపై ఫిర్యాదుల సంఖ్య వెల్లువెత్తుతున్నదని అధికారులు గుర్తించి, వీటి పునరుద్ధరణ కోసం సిఫారసు చేసినట్లు తెలుస్తున్నది. ఈ కమిటీల పనితీరు తెలుసుకున్న ప్రభుత్వం వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించగా, గ్రామాలవారీగా గతంలో పనిచేసిన మహిళల వివరాలను డీఆర్‌డీఏ సిబ్బంది సేకరిస్తున్నట్లు సమాచారం.

కళలకు కాణాచి తెలంగాణ

శంకరపట్నం, ఆగస్టు 25: కళలకు కాణాచి తెలంగాణ అని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మొలంగూర్ శివారులోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో కళా రవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శంకరపట్నం మండలంలో గొప్ప కళాకారులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు, అలాగే ఎమ్మెల్యే చేతుల మీదుగా పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌రావు, దుర్గై రాజ్, కళాకారుల అసోసియేషన్ అధ్యక్షుడు సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

గంగాధర, ఆగస్టు 25: వివిధ అనారోగ్య సమస్యలతో దవాఖానల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 311 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.63,39,500 ఆర్థిక సాయం మంజూరైంది. ఆదివారం మండలంలోని మధురానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్యం చెక్కులను అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌తో తమను ఆదుకున్న ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

కార్పొరేషన్, ఆగస్టు 25: కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఇటీవల అమెరికాకు వెళ్లగా, తనకు ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు ఇవ్వాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ కలెక్టర్ పమేలా సత్పతిని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన పార్టీ కాంగ్రెస్

విద్యానగర్, ఆగస్టు 25: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జోన్ ఇన్‌చార్జి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాపాలన అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. ఆదివారం కరీంనగర్ బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో, అనంతరం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మి గార్డెన్‌లో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్.. ప్రజలు, రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల దృష్టిలో ఆ పార్టీ అంటేనే బోగస్, మోసం అనే భావన ఏర్పడిందన్నారు. అందుకే ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. 2014 తర్వాత ప్రస్తుతం కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు భాస సత్యనారాయణ రావు, మాజీ మేయర్ డి. శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఎండీకి ఆరువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 25: లోయర్ మానేరు జలాశయంలోకి శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శనివారం 2వేల క్యూసెక్కులతో నీటి విడుదలను ప్రారంభించిన అధికారులు.. ఆదివారం 6వేల క్యూసెక్కులకు పెంచారు. ఇన్‌ఫ్లోతో ఎల్ఎండీలో అర టీఎంసీ మేర ఇన్‌ఫ్లో వచ్చింది. 24టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీలో 6.116 టీఎంసీల నిల్వ ఉన్నది. ఎస్సారార్ జలాశయం నుంచి నీళ్లు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కావలెను
PAYTM లో ఉద్యోగ అవకాశాలు: ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ అర్జెంటుగా కావలెను Q: 10th & Above. స్మార్ట్ ఫోన్ & బైక్ తప్పనిసరి.జీతం: 21k+ఇన్సెంటివ్స్ఉంటాయి. ఆన్రోల్ జాబ్ మరియు ఈఎస్ఐ పీఎఫ్ కటింగ్ ఉంటుంది. మొబైల్ నెంబర్స్: 9490116269, 9966762969

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

జేఏసీ రాష్ట్ర స్థాయి సమావేశానికి తరలిన ఆటో కార్మికులు

తెలంగాణచౌక్, ఆగస్టు 25: హనుమకొండలో ఆదివారం నిర్వహించిన ఆటో జేఏసీ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి కరీంనగర్ ఆటో కార్మికుల సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు మదెద రాజేందర్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు తరలి వెళ్లారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని, ప్రతి ఆటో డ్రైవర్‌కు జీవనభృతి రూ.12వేలు అందించాలని, మృతి చెందిన ఆటో డ్రైవర్లకు పరిహారం ప్రకటించాలనే డిమాండ్లపై రౌంట్ టేబుల్ సమావేశంలో చర్చించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందిస్తామని రాజేందర్ తెలిపారు.

పల్లెలోనే రేషన్ బియ్యం ఇవ్వాలని పోచమ్మకు వేడుకోలు

చిగురుమామిడి, ఆగస్టు 25: గాగిరెడ్డిపల్లె పరిధిలోని బొల్లోని పల్లెలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోచమ్మ తల్లి ఆలయానికి డప్పుచప్పుళ్లతో వెళ్లి పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. రేషన్ బియ్యం కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాగిరెడ్డి పల్లెకు వెళ్లాల్సి వస్తున్నదని, బొల్లోని పల్లెలోనే పంపిణీ చేసేలా అధికారులు చొరవ చూపాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. అలాగే గ్రామంలోనే పోచమ్మ దేవాలయాన్ని నిర్మించాలని, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గట్టు సంపత్, బొల్లి రాజు, నాగరాజు, రాజయ్య, వెంకటయ్య, రాజేశం, మల్లేశం, బాలయ్య, వెంకటస్వామి, భూమయ్య, రాజి రెడ్డి, రామి రెడ్డి, మల్లయ్య, మధు, వెంకటేశ్, శ్రీను, శ్రీనివాస్, సురేశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పారమిత విద్యార్థిని

కొత్తపల్లి, ఆగస్టు 25: మహబూబ్‌నగర్‌లో ఈనెల 25 నుంచి జరుగనున్న 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎన్ అశ్విక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపడంతో రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థినిని పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

వినియోగదారులు సహకరించాలి

సైదాపూర్, ఆగస్టు 25: విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ బొమ్మ ఆంజనేయులు కోరారు. ఎక్లాస్‌పూర్ గ్రామంలో ఓవర్‌లోడ్ ఉన్నందున మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సమస్యలు ఉంటే తమకు తెలుపాలన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా మీటరు తీసుకుని విద్యుత్‌ను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాంచంద్రం, అమర్‌నాథ్, శ్రీనివాస్, దేవరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ బూటకం

శంకరపట్నం, ఆగస్టు25: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ బూటకమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఎంతో మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. వారంతా కొత్తగా దరఖాస్తులతో వ్యవసాయ కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నారని తెలిపారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం

చొప్పదండి, ఆగస్టు 25: రుక్మాపూర్ గ్రామంలో పనిచేసి బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శి మహితాబ్, అగ్రికల్చర్ ఏఈవో ప్రసన్న కమార్, ఏఎన్ఎం లక్ష్మిని ఆదివారం మాజీ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కర్రె శ్రీనివాస్, చిలుక లింగయ్య, మాజీ ఎంపీటీసీలు ముద్దసాని రంగన్న, ఉప సర్పంచ్ చిరంజీవి, మాజీ వార్డు సభ్యులు దొంతి సారపు సంపత్, నెరుమట్ల మోహన్, తాటికొండ రవి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 25: కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు చేయని పక్షంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షను చేపడతామని హెచ్చరించారు.

పొట్టచేతపట్టుకుని వచ్చి.. ప్రమాదంలో మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 25: పొట్టచేత పట్టుకుని వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదంలో మరణించిన విషాదకర ఘటన మండలంలోని అల్గునూర్‌లో చోటు చేసుకుంది. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం చంపారన్ జిల్లా సిస్విపట్న గ్రామానికి చెందిన కిశోర్‌రాయ్ అనే వ్యక్తి అల్గునూర్‌లోని భాస్కర్ రైస్‌మిల్లులో కూలి పనులకు కొద్ది రోజుల క్రితం వచ్చాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సమయంలో రైస్‌మిల్లులో వాహనాలు పార్కింగ్ చేసుకునే స్థలం సమీపంలో పడుకున్నాడు. అదే సమయంలో సూరజ్ అనే వ్యక్తి గూడ్స్ వ్యాన్‌ను పార్కింగ్ చేస్తుండగా.. కిశోర్‌రాయ్‌పైకి వాహనం ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం తోటి కార్మికులు హుటాహుటిన దవాఖానకు తరలిస్తుండగానే కిశోర్‌రాయ్ మరణించాడు. మృతుడి సోదరుడు రూపేశ్‌రాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మానకొండూర్ రూరల్, ఆగస్టు 25: గడ్డి తీసుకువచ్చేందుకు వెళ్లిన మహిళ విష పురుగు కుట్టడంతో తీవ్ర అస్వస్థతకు లోనై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మానకొండూర్ సీఐ సదన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చుక్క లచ్చమ్మ (50) శనివారం సాయంత్రం సమయంలో పశువులకు మేత తీసుకొచ్చేందుకు ఇంటి వెనుకాలే ఉన్న గడ్డివాము వద్దకు వెళ్లింది. గడ్డివాముపై ఉన్న పరదను తీస్తున్న క్రమంలో ఎడమ పాదంపై ఏదో విష పురుగు కుట్టినట్లు అరవడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగానే పరిస్థితి విషమించి లచ్చమ్మ మృతి చెందింది. మృతురాలికి కుమారుడు రమేశ్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, ఆగస్టు 25: ప్రభుత్వ అనుమతి లేకుండా మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని మామిడాలపల్లి గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సింగారపు వేణు ప్రసాద్, ఓనర్ సింగారపు రాజలింగుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మోసం చేసిన ముగ్గురిపై కేసు

వీణవంక, ఆగస్టు 25: మంత్రాలు, తాయత్తుల పేరుతో మోసం చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్‌రెడ్డితో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరికి శనిదోషం పట్టిందని, దానిని తొలగించుకోకపోతే చనిపోతారని వేములవాడ మండలం వీర్లవంచ, ఆర్ఆర్ నగర్‌కు చెందిన పైత్యం బాలరాజు, గంధం రాజు, పైత్యం చందు భయబ్రాంతులకు గురి చేశారు. తాము పూజలు చేసి తాయత్తులు కడుతామని నమ్మించి శ్రీనివాస్‌రెడ్డి వద్ద రూ.9 వేలు, మరో ఇద్దరి నుంచి రూ.11 వేలు తీసుకున్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవీరబ్రహేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

మానకొండూర్, ఆగస్టు 25: మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహేంద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. శని, ఆదివారాల్లో ఆలయంలో సుప్రభాతసేవ, మూలవిరాట్టుకు, ఉత్సవ మూర్తులకు ఫల, పంచామృత అభిషేకాలు, అగ్ని ప్రతిష్ఠ, హోమం, మహ నివేదన, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో అర్చకులు కొత్తపల్లి బ్రహ్మచారి, వనపర్తి రాంసాగర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్‌గా ఇందుర్తివాసి ఎంపిక

చిగురుమామిడి, ఆగస్టు 25: ఇందుర్తి గ్రామానికి చెందిన నామ ఐలయ్య రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌గా ఎంపికయ్యారు. కొన్ని సంవత్సరాలుగా సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ, ఆర్టీసీలో ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానానికి చేరవేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌గా ఎంపికకాగా, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఐలయ్య కరీంనగర్ వన్ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి

తెలంగాణచౌక్, ఆగస్టు 25: బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్ 106వ జయంతి వేడుకలను ఆదివారం నగరంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కులాల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో బీపీ మండల్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవారు లత పటేల్, సరోజన, సంధ్య, మల్లికార్జున్, నారాయణ పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల్ జయంతి వేడుకల్లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్, నాయకులు సంజీవ్, రాజేశ్, మురళి, తిరుపతి పాల్గొన్నారు.

గీతామందిర్‌లో 'సుదర్శన నారసింహ హవనం'

జమ్మికుంట, ఆగస్టు 25: పట్టణంలోని శ్రీ భగవద్గీతా గీతామందిర్‌లో సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు మరింగంటి సంతోష్‌కుమారాచార్యులు, హరికృష్ణమాచార్యులు, తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య 'శ్రీ వాసుదేవా హోమం, సుదర్శన నారసింహ హవనం' నిర్వహించారు. అంతకుముందు భక్తులు శ్రీవిష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం, భగవద్గీతా పారాయణం, రక్షాబంధనం, ఆరాధన చేశారు. తీర్థప్రసాద వితరణలతో కార్యక్రమాలు ముగిశాయి. అనంతరం భక్తుల కోసం ఆలయ సేవా సంఘం సభ్యులు వైకుంఠం, సతీశ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు మహన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం పురవీధుల్లో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత 'శ్రీవేణుగోపాలస్వామి' శోభాయాత్ర నిర్వహించారు. మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ సేవా సంఘం సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీలో మండల వాసులకు చోటు

చిగురుమామిడి, ఆగస్టు 25: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులకు జిల్లా కమిటీలో పదవులు లభించాయి. సుందరగిరి గ్రామానికి చెందిన పెసరి శ్రీనివాస్ ప్రగతి మత్స్య కార్మిక సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా, రేకొండ గ్రామానికి చెందిన నెల్లి శంకర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నవాబ్ పేట్‌కు చెందిన పిల్లి స్వామిని నియమించారు. ఈ మేరకు తెలంగాణ ప్రగతి మత్స్య కార్మిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తం శ్రీనివాస్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నియామకమైన నాయకులు మాట్లాడుతూ, ముదిరాజ్, మత్స్యకార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చిగురుమామిడి, ఆగస్టు 25: మండలంలోని రేకొండ గ్రామంలో 1990-91 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితుడు గోపగోని శ్రీనివాస్ తండ్రి లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి ఆదివారం 50 కేజీల బియ్యంతో పాటు నగదు అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇక్కడ గౌడిశాల శ్రీనివాస్, కల్వల సంపత్‌రెడ్డి, పంకెర్ల కుమారస్వామి, దుడ్డెల సుదర్శన్, జూపాక అంజయ్య, కారపూరి వెంకటేశం, పీర్ల తిరుపతి, గంద్రతి సమ్మయ్య, పెద్ది సమ్మయ్య, దుడ్డెల రాజయ్య, ఏరుకొండ కుమారస్వామి తదితరులున్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

వింధ్యావ్యాలీ పాఠశాలలో శ్రీకృష్ణుడి వేషధారణలో ఉట్టికొడుతున్న చిన్నారులు

కొత్తపల్లి, ఆగస్టు 25 : స్థానిక మెహర్‌నగర్‌లోని వింధ్యావ్యాలీ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అందంగా ముస్తాబై ఆటపాటలు, నృత్యాలతో బృందావనాన్ని తలపించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 25 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గల బాలభవన్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొన్న చిన్నారులు, కోలాటాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. అలాగే, ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్, మ్యూజిక్ టీచర్ మంజులాదేవి, డ్రాయింగ్ మాస్టర్ కృష్ణ కుమార్, టేలరింగ్ టీచర్ సూర్యశ్రీ, డ్యాన్స్ మాస్టర్ రాధాకృష్ణ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలభవన్‌లో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు